# చీకటి కక్కిన వెలుగు

తెల్లవారింది. రోజూ తెల్లవారుతూనే వుంటుంది.

ఇంక దినచర్య మొదలు!

కమల కాఫీ కప్పు తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

''కమలా'' అన్నాను.

వినిపించుకోకుండా వెళ్ళిపోయింది మనసులో మాట మనసులోనే ఉండిపోయింది. సైకిలు బెల్లు వాయించి పేపరు పడేసి వెళ్ళిపోయాడు న్యూసు పేపరు కుర్రాడు. నానీ పరిగెత్తుకుంటూ వచ్చి పేపరు అందించాడ ు.

''గుడ్ బోయ్'' అన్నాను.

సంతోషంగా వెళ్ళిపోయాడు.

కాఫీ కప్పు అందుకున్నాను. పేపర్ని వెతుకుతున్నాయి కళ్ళు.

కాఫీ రుచి ఏడవదు. పేపరులో ఏమీ విశేషాలుండవు!

హత్య. ఆత్మహత్య, దోపిడి... ఎవరిక్కావలీ చెత్త.

స్టేట్ లాటరీలో నా నెంబరుంటే రాష్ట్రపతి ఎవార్డులో నాపేరుంటే హ్హహ్హహ్హ...నేనెందుకిక్కడ ఇట్లాగ ఉంటాను.

వాళ్ళంతా ఎవరో పెట్టి పుట్టినవాళ్ళు....రుచి లేని కాఫీ లాగ పేపరు..... విశేషాలు లేని పేపరు లాగ బ్రతుకు.

వెధవ బ్రతుకులు ఏముంది ఈ బ్రతుకుల్లో.

న్యాయంగా బ్రతకాలంటే కోరికల్ని చంపేసుకోవాలి.

ఎలాగో ఓలాగ బ్రతకటానికి మనుషులు మరల్లాగా మారిపోవాలి.

ముందు పేజీలో నిన్నటి వార్తలే పునరుక్త మవుతాయి.

వెనక పేజీలో ఒక వింతో విశేషమో పడేస్తాడు...

ఆ.... నేననుకుంటున్నట్టే ఇక్కడ వుంది ఒక ఆత్మహత్య ఎవరో రంగధామ్... సైంటిస్టు... అధికారి చర్యని నిరసిస్తూ... సైంటిస్టు... ఇన్స్టిట్యూటు.... పూర్... ఎవరీ రంగధామ్? మా రంగ... గుండె తీవ్రంగా కొటుకుంటూ మా రంగధామే అనటానికి ఒప్పుకోవటంలేదు. ఒప్పుకోనంత మాత్రాన... ఒక గుండె కాదన్నంత మాత్రాన ఒక మనిషి నమ్మలేదంటే మాత్రం ఒక వాస్తవం. ఒక జరిగిన సంగతి ఉట్టి ఊహ, ఒక కల ఐపోతుందా? జరిగినది... చెరగదు కదా! సందేహం లేదు. మా రంగధామే!

ఎంత మాట విన్నాను! ఎంత పని జరిగి పోయింది!

రంగధమ్ జీవితం ఇట్లాగా ముగుస్తుందనుకోలేదు.

ఎందుకనుకుంటాను? ఎట్లా గనుకుంటాను?

రంగధామ్!

మేరు పర్వతం లాటి వాడు!

మనిషి సంకల్పిస్తే సాధించలేనిది లేదని గర్వించాను.

వాడు నాకు స్నేహితుడని. నేను వాడికి స్నేహితుణ్ణని సంతోషించాను.

ఒక్క మాట చెప్పలేదు. మనసు విప్పలేదు.

ఎంత పని చేశాడు!

చాలా మందికి ఎప్పుడో ఒకప్పుడు చెయ్యాలనిపించే పని.

కానీ తనంతట తాను ఈ ప్రాణం పోయేదాకా మనిషి తెగించలేని పని!

ఇంత ప్రపంచమూ ఎందుకూ పనికి రాదనేశాడు.

భార్యా... పిల్లలూ... స్నేహితులూ ఎవ్వరూ అడ్డుకోలేకపోయారు!

అన్ని నమ్మకాలు వమ్ము అయిపోయాయి.

తన తెలివితేటల్ని నమ్మాడు...తన డిగ్రీల్ని నమ్మాడు.

మన విధానాన్ని నమ్మాడు... ప్రభుత్వాన్ని నమ్మాడు.

నమ్మకం ఉండబట్టే ఇన్ని మెట్లు అధిగమించాడు.

అధిగమించాడు గనుకనే గట్టి నమ్మకం ఏర్పడింది.

స్టేట్స్‌కి వెళ్ళి వచ్చాడు. అందరి మెప్పు పొందాడు.

తగిన ఉద్యోగం కూడా పొందాడు. అప్పుడు... అప్పుడు...

నువ్వెక్కిన మేడ పునాదులతో సహా కూలిపోతోందని తెలిస్తే...

నువ్వు కూర్చున్న చోటు మహా ప్రవాహంలో కొట్టుకుపోతుంటే నీవిలాస యానంలో విమానం కూలి కారడవిలో దిక్కు తెలీని చోట పడితే...ఫరవాలేదు, విధి విపరీతమని సర్దుకోవచ్చు.

నీ యెదుట దండం పెట్టే క్రిందవాడు నీ వెనకాల నిన్ను వెధవ అంటే నువ్వు నీ కూతురికి కుదిర్చిన సంబంధాన్ని నీ చుట్టం ఎక్కువ కట్నానికి బేరమాడుకుపోతే.

అప్పు పుచ్చుకున్న స్నేహితుడు తిరిగి నీకు ముఖం చూపించకపోతే అదీ సరిపెట్టుకోవచ్చు లోక రీతి అని.

నీ అర్థ భాగమనుకున్న భార్య ఇంకొకడికి ప్రేమలేఖ రాస్తే. నిన్ను ముద్దు చేసే అమ్మ ఎవరిమీద కోపంతోనో నీ చెంప ఛెళ్ళుమనిపిస్తే. నీ తండ్రి నీ స్నేహితుడి తండ్రి ఉద్యోగం తీయించేస్తే....

ఇంక లేవలేవు నాయనా.... మళ్ళీ తలెత్తుకోలేవు.... నవ్వలేవు.

అంతే కానీ....

ఎవడో ఒక ఆఫీసరు దుస్తులు ధరించిన వాడు....

కోటిమందిలో ఒక బోడిలింగం....

నెపోటిజానికి బానిస, ఆత్మని చంపుకున్నవాడు.

నీకు అర్హత లేదన్నాడని ఇంత పని చేస్తావా?

ఇంకెన్నో విధాల నీకూ, నీ అయినవాళ్ళకీ అమూల్యమైన ప్రాణాన్ని త్యజిస్తావా?

అత్తమీద కోపం దుత్తమీద అని సామెత చెప్పినట్టు.

చెరువు మీద కోపంతో నీళ్ళు తాగకపోతే...

ఎవరికి నష్టం నాయనా ఈ లోకంలో!

మనం మనకోసమే బతుకుతాము, ఎవరికోసమో కాదు.

అందుకని... ఒకరు మెచ్చుతారని ఒకరు నవ్వుతారని నీ బ్రతుకు నువ్వు బతకటం మానకు.

ఇంకొకరి దుస్తుల్లో నువ్వు నటించకు.

ఇదంతా నీకు చెప్పాలని, మోరల్ సపోర్టు అందించాలనుకుంటే ఇప్పుడు నువ్వు అందని లోకానికి వెళ్ళిపోయావు రంగధామ్... తొందరపడ్డావు!

పెద్ద కథ కావలసిన జీవితాన్ని చిన్నదిగా తుంచేశావ్!

నాలుగు నిద్రమాత్రలు!

గ్రహాంతర యానం చేసి తిరిగి వస్తున్నాడు మనిషి కులాసాగా.

కాని నాలుగు నిద్ర మాత్రలు ప్రాణాన్ని మళ్ళీ శరీరంలో చేరనివ్వవు పరమాణువు చాలు ప్రపంచాన్ని భేదించటానికి.

నిద్ర మాత్రకి ఎంత శక్తి ఉంది.

ఈ ఆవేదన ఎల్లాగ ఉపశమిస్తుంది....

ఈ జలపాతానికి ఏమిటి దోవ

అమ్మయ్య...సుందరం వచ్చేశాడు....

వీడి మొహం తీవ్రత దాల్చింది. వాడి కన్నుల్లో బాధ కనిపిస్తుంది.

ఈ పేపరే వీడిని ఇక్కడికి లాక్కువచ్చింది.

సుందరం కంఠం కూడా తీవ్రంగాఉంది.

"వీడింత బుద్ధి లేని పని చేస్తాడని నేనెప్పుడూ అనుకోలేదురా. తన తెలివి తేటల్ని తను సంపాదించుకున్న గొప్పతనాన్ని తనే కించపరుచుకున్నాడు.

తన మీద తనకే నమ్మకం లేదని బుజావు చేశాడు.

అటువంటి వాడిని చూసి అందరూ జాలి పడతారురా.

గౌరవించరు, మెచ్చుకోరు, జాలిపడతారు, పిచ్చివాడంటారు. మహా ప్రవాహం లాగ సాగిపోతున్న అక్రమాలకీ, అన్యాయాలకీ అనువు చూసి ఆనకట్ట కట్టాలి కానీ.

తన చేయి తెగ్గొట్టి సమిధ వేస్తే అది ఆగుతుందా.... ప్చ్... ప్చ్ అసలు మహావృక్షం ఎలా కూలిపోయిందంటావ్.

అది వేళ్ళకి పట్టిన పురుగు.... పునాదికి సంబంధించిన భూకంపం అది మెదడుకి పట్టిన జబ్బు... మనవాడిదే తప్పు.

లేకపోతే నువ్వూ, నేనూ చస్తున్నామా?

మనకి మాత్రం అవమానాలూ, అసంతృప్తులూ లేవూ!

నన్నడిగితే ఆ లెక్కన ఒక కోటి తప్ప మిగిలిన ఏభైనాలుగు కోట్ల భారతీయులూ ఉరి పోసుకోవా లనుకుంటాను!

అసలు ఈ సృష్టి యావత్తు దేవుడిమీద తిరగబడా లంటాను.

ఇంతవరకూ అతడి నీడలో నిశ్చింతగా బ్రతికిన భార్య ఆశ్రయం కూలిపోయిన తల్లి పక్షి లాగ పిల్లల్ని వెంటేసుకుని ఆధారం వెతుక్కోవాలి! ఆహారం కోసం ఆకలి చూపులకు గురి కావాలి.

స్నేహితు లందరూ కుమిలిపోతున్నారు.
మనిషన్నవాడికి మతి పోతోంది.
ఎవరో ఆఫీసరుగాడు అన్న మతి లేని మాట.
చేసిన అన్యాయపు పని ఎక్కువా? వీళ్ళంతా ఎక్కువా?
అయినది ఆకులో కానిది కంచంలో పెట్టేశాడురా వీడు.
ఎవరెస్టు ఎక్కలేక చచ్చినవాళ్ళలో జమైపోయాడు.
అనామకు డైపోయాడు....అర్భకు డైపోయాడు.
బ్రహ్మాస్త్రం పిచ్చికమీద వేసేశాడురా...
ఆఫీససరు పీనుగకి ప్రాణాలర్పించేశాడు.
ఈ ప్రపంచంలో పదవులూ... విజ్ఞానం తప్ప ఇంకే జ్ఞానం, జీవితమూ లేవూ!

తనకి జరిగిన అన్యాయం తప్ప ఇంకే దారుణాలూ లేవూ? రాట్ రేసులో పాల్గొన్నాడు. పదవినే చూసుకున్నాడు.

అంత కుంచించుకుపోవటం మనిషన్న వాడికి తగదురా.
అంతటి శాస్త్రవేత్త నాగలి పట్టుకుని పొలం దున్నితే...
జీనియస్సులకి జీనియస్సు ఎలిమెంటరీ స్కూలు మాస్టరైతే....
అంతకంటే కనువిప్పు వుంటుందా ప్రభుత్వానికి కానీ, లోకానికి కానీ.
ఇది నిజంగా జబ్బే, మానసిక వ్యాధి. మందు లేని వ్యాధి.
సుందరం రంగధామాన్ని తిట్టి తన బాధ తీర్చుకున్నాడు.
తీర్చుకుని వెళ్ళిపోయాడు.
ఎంత వెలుగు! నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.
వీడికి! ఈ సుందరానికి ఇంత జ్ఞానం ఎల్లాగొచ్చింది?
రంగధామ్‌ని బలహీను డనగల ఆత్మబలం ఎక్కడినుంచి వచ్చింది?
మావగారింట్లో ఇల్లరికం పడలేక, పెళ్ళాం చేసే నిర్లక్ష్యం సహించలేక,
గోదావరిలో మునిగి చస్తానన్నాడు.
బుద్ధి మేథమేటిక్స్ చదువుతానంటే
మనిషి మందుల షాపులో కూచోవలసి వచ్చింది.
భార్య అనుకూలవతి కావాలని మనసు పడితే
తనే ఆవిడ అడుగులకి మడుగులొత్తాల్సిన గతి పట్టింది.
ఏదో ఒక మందు మింగి చస్తానన్నాడు. ఇంకా ఈ బ్రతుకు యీడ్చ లేనన్నాడు.

వీడి మానసిక వ్యాధికి మందు దొరికిందా?
రోగం కుదిరిపోయిందా?
ఎక్కడ? ఎప్పుడు? ....ఇక్కడ, ఇప్పుడే....
నాకూ దొరికింది.
నేను మాత్రం ఎన్నిసార్లు చద్దామనుకోలేదూ
ఎవరూ లేని చోటికి పారిపోదా మనుకోలేదూ
పంపించిన కథలన్నీ తిరిగి వస్తున్నాయని.
రెండు నెలల నుంచి పూర్తి జీతాలు లేవని.
నిన్న కూడా అనుకున్నాను చస్తే నయం అని.
అమ్మ నా చిన్నతనంలోనే పోలేదు
నాన్న స్నేహితుడితో లేచి పోయిందని తెలిసినప్పుడు.
ఏక పత్నీ వ్రతుడిని. కానీ నవరసభరితం నా హృదయం.

సరసత, చతురత ఎరగని భార్య నా జీవితంలో అడుగు పెట్టినప్పుడు నాకూ ఇట్లాగే దిగ్బంధనమైంది ఊపిరి స్తంభించిపోయింది.

ఇట్లాగే ఎన్నో జరుగుతాయి ఈ ప్రపంచంలో
ముసలి తండ్రి బ్రతికి ఉండగా బిడ్డల తండ్రికి కాన్సర్ వస్తుంది.
ముష్టి ఎత్తి తెచ్చుకున్న అన్నాన్ని కుక్క ఎత్తుకుపోతుంది.
అనుకోనివి జరుగుతుంటాయి. కనకనే మనిషి ఇంకా తల ఒంచుతున్నాడు.
నాకు ఇప్పుడు చావాలనిపించటం లేదు.
నా చుట్టూ ఉన్న గాలిని గుండెల నిండా పీల్చాలని ఉంది.
నా మనసులో నిండుతున్న వెలుగులో కొత్త ఆశలు కట్టుకోవాలని ఉంది.
చెట్టునించి రాలిన ఆపిల్ పండు భూమి మీదనే పడాలి.
భగవంతు డిచ్చిన ప్రాణం భగవంతుడే తీసుకోవాలి.
ఎవరూ లేని చోటికి వెళ్ళట మెందుకు? నా వెర్రి కానీ.
వెలుగు నుంచి నలుపూ - తెలుపూ విడదీసి ప్రపంచం సృష్టించాడు.
మంచీ - చెడూ తెలుసుకొనే వివేకం పెట్టాడు.
వివేకం ఉండి ప్రలోభంలో పడిపోయే మనసు పెట్టాడు.
ఈ రెండిటి మధ్యా ఊగులాడమన్నాడు.
ఈ వర్ణచిత్రంలో. ఈ క్రీనీడల క్రింద వెలుగుని వెతుక్కోవటమే బ్రతుకు!

ఎవరూ లేని చోట ఏమీ ఉండదు.
ఏమీ లేని చోట బ్రతుకే ఉండదు.
ఎన్నాళ్లో ఈ అదృష్టం? ఇక్కడే ఉంటాను.
చచ్చిపోదా మనుకుంటూనే చివరిదాకా బ్రతుకుతాను.
ఎక్కడినుంచి వచ్చింది బలం సుందరానికి లాగే నాకూను.
ఎంత వెలుగు... ఎంత ఆశ...
రోజూ తెల్లవారుతూనే ఉండాలి.
కమల అందించే కప్పు కాఫీకోసం.
నానీ పిలిచే 'నాన్నా' అనే పిలుపుకోసం.
ఏడాదికో మంచి సినిమా ఐనా చూడటంకోసం ఇంకా ఇంకా బ్రతుకుతాను.
ఈ సౌఖ్యాలింక దొరకవు నిద్ర మాత్రలు మింగితే.

ఒరేయి అనే సుందరం పిలుపు, మెట్ల పక్క పూసిన మెట్టతామర పువ్వు నేను ఇంకా ఇంకా వినాలి.... ఇంకా ఇంకా చూడాలి.

ఈ బ్రతుకు నాకు ఇంకా ఇంకా కావాలి.

ఈ జీవితంలో ఎంత అందం ఒదిగి ఉంది! ఈ లోకంలో ఇంకా ఎంత పోరాటం మిగిలి ఉంది!

ఈ శివతాండవంలో జీవాత్మనై నర్తించి నర్తించి ఎప్పుడో లయం చెందుతాను. నా జీవితపు పూరేకులు తమ లోపలి భవిష్యత్తుకోసం విత్తనాల్ని దాచుకున్నాకే రాలిపోని...

ఎంత వెలుగు వదిలి వెళ్ళావూ!
నువ్వు ఒక్కడివే చీకటిలో కలిసి పోతూ.

నాలో, సుందరంలో, మరెందరో వంద ప్రమిదలలో ఆశ అనే నూనె పోసి ఆత్మ బలం అనే వత్తి వెలిగించి మరీ వెళ్లావు.

నువ్వు ఎదిరించాలనుకున్న అన్యాయం కళ్లు తెరిచినా తెరవకపోయినా
బలహీనుల వెన్ను తట్టి హెచ్చరించి వెళ్ళావు.
నీ ఉద్దేశం ఏదయినా.....మా కళ్ళు తెరిపించావు.
కృతజ్ఞుడినిరా...రంగధామ్ర...కృతజ్ఞుడిని...
కళ్ళలో తిరిగిన నీటిని తుడుచుకున్నాను.
చల్లారిన కాఫీని గడగడా తాగేశాను.

* * * *